క్లుప్తంగా

వైభవంగా గజ్జపూజ



కోలాటం ఆడుతున్న మహిళలు

పొదలకూరు: పట్టణంలోని అయ్యప్పనగర్‌లో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం రాత్రి గజ్జపూజను వైభవంగా నిర్వహించారు. కొద్దిరోజులుగా ఆలయ ప్రాంగణంలో భజన గురువు ఆకుల గంగిరెడ్డి పర్యవేక్షణలో భక్తులు కోలాటంలో శిక్షణ పొందుతున్నారు. ఈ క్రమంలో భక్తులు గజ్జ పూజను నిర్వహించి కాలికి గజ్జలు కట్టుకుని కోలాటం వేశారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బోయిళ్ల మాలకొండారెడ్డి, అల్లూరు రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

చెరువు వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డు



పొదలకూరు: పట్టణానికి సమీపంలో ఉన్న చెరువు వద్ద శుక్రవారం పంచాయతీ కార్యదర్శి ఎస్‌కే అల్లాభక్షు పర్యవేక్షణలో పోలీసుశాఖ వారు ప్రమాద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. చెరువులో ఎవరూ ఈతకు దిగడం, చేపలు పట్టడాన్ని నిషేధించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు భాస్కర్, హరి, మహిళా పోలీసు విజయలక్ష్మి పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా ధ్వజారోహణ



ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహిస్తున్న అర్చకులు

ఇందుకూరుపేట: స్థానిక శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ధ్వజారోహణ కార్యక్రమాన్ని శుక్రవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అర్చకుడు ఉదయగిరి వెంకటశేషాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజలకు మున్నా వెంకటసుధాకర్ - కరుణ ఉభయకర్తలుగా వ్యవహరించారు. రాత్రి శేషవాహనసేవ, ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలుగా కంచర్ల సుబ్బారావు జ్ఞాపకార్థం ఆయన సతీమణి వెంకటసుబ్బమ్మ వ్యవహరించారు. కార్యక్రమంలో ఉదయగిరి రంగాచార్యులు, నందకిషోర్ పాల్గొన్నారు.

విష్ణాలయంలో ఏకాదశి పూజలు



ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి

మనుబోలు: ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక విష్ణాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు హనుమాచార్యులు శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పుష్పాలంకరణ, విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమాలకు ముంగర ధనుంజయరెడ్డి - సరిత దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

రేపు ఎఫ్‌పీఓ రాష్ట్రస్థాయి సమావేశం

కోవూరు: మండలంలోని వేగూరులో ఉన్న ప్రగతి యువకేంద్రంలో ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్(ఎఫ్‌పీఓ) రాష్ట్రస్థాయి ద్వితీయ సమ్మేళనం ఆదివారం జరుగుతుందని ఎఫ్‌పీఓ నిర్వాహకులు గునపాటి భూపేష్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమ్మేళనంలో ఆంధ్రప్రదేశ్‌లోని కోఆపరేటివ్ సొసైటీలు, మ్యాక్స్ ఎఫ్‌పీఓలకు సంబంధించిన వారంతా పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో అఖిల భారత అధికారి కృష్ణారెడ్డి, సహకార భారతి ఉపాధ్యక్షుడు సతీష్‌చంద్ర, ఏపీలోని అన్ని జిల్లాల సహకార సంఘాల మహిళలు పాల్గొంటారని తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

కొడవలూరు: ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని యల్లాయపాళెం మజరా ఎన్టీఆర్ గిరిజనకాలనీలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. కాలనీకి చెందిన చౌటూరు సుబ్బరామయ్య (55) మద్యానికి బానిసయ్యాడు. పనికి వెళ్లడం మానేశాడు. పని చేయకపోతే ఇల్లు ఎలా గడుస్తుందని భార్య ముత్యాలమ్మ ప్రశ్నిస్తుండేది. సుబ్బరామయ్య జీవితంపై విరక్తి చెంది బుధవారం మద్యంలో పురుగుమందు కలిపి తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబసభ్యులు గుర్తించి అతడిని నెల్లూరులోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. ముత్యాలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై జి.సుబ్బారావు శుక్రవారం కేసు నమోదు చేశారు.

రైతు ఇంట.. సిరుల పంట

ఈ ఏడాది వరి సాగు చేపట్టిన రైతుల ముఖాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. అన్నదాతలు సాగు చేసిన వరి పంట ఆశించిన స్థాయిలో దిగుబడి వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం కూడా రైతులకు అండగా నిలిచింది. ప్రస్తుతం వరికోతలు ముమ్మరంగా సాగుతున్న క్రమంలో ఈ ఏడాది ధాన్యం ధరలు ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో ఉండడంతో సర్వేపల్లి నియోజకవర్గంలో రైతులు కల్లాల్లోనే ధాన్యాన్ని విక్రయిస్తూ లాభాలు పొందుతున్నారు. ధాన్యం ధరలతో ఈ ఏడాది రైతు ఇంట సిరుల పంట కురుస్తోంది.

- ముమ్మరంగా సాగుతున్న వరి కోతలు
- అన్నదాతలు ఆశించిన స్థాయిలో దిగుబడులు
- రికార్డు ధరలతో ధాన్యం కొనుగోళ్లు
- సంతోషం వ్యక్తం చేస్తున్న రైతులు

వెంకటాచలం: సర్వేపల్లి నియోజకవర్గంలోని వెంకటాచలం, పొదలకూరు, మనుబోలు, ముత్తుకూరు, తోటపల్లిగూడూరు మండలాల్లో ఈ ఏడాది రైతులు 71,400 ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. ఎక్కువగా బీపీటీ–5204, ఆర్‌ఎన్‌ఆర్ –14038(షుగర్ లెస్) రకాలు సాగు చేశారు. సకాలంలో వర్షాలు కురవడం, సోమశిల, కండలేరు జలాశయాల్లో సమృద్ధిగా సాగునీరు ఉండడంతో సాగునీటికి ఎలాంటి ఢోకా లేకుండా రైతులు పంటలు పండించుకున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో వ్యవసాయానికి విద్యుత్ సక్రమంగా ఇవ్వకపోవడంతో రేయింబవళ్లు సాగునీటి కాలువలపై కాపలా ఉంటూ రైతులు అష్టకష్టాలు పడేవారు. కానీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక వ్యవసాయానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నారు.



కల్లంలోనే ధాన్యం కాటా వేస్తున్న కూలీలు

ధాన్యానికి ఎన్నడూ లేని ధరలు

సర్వేపల్లి నియోజకవర్గ పరిధిలోని వెంకటాచలం, మనుబోలు మండలాల్లో ప్రస్తుతం వరి కోతలు ప్రారంభమయ్యాయి. వెంకటాచలం మండలంలోని తిక్కవరప్పాడు, కంటేపల్లి, చెముడుగుంట, కందలపాడు, కసుపూరు గ్రామాల్లో వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. బీపీటీ–5204, ఆర్‌ఎన్‌ఆర్ –14038(షుగర్ లెస్) రకం ధాన్యం ధరలు ఎన్నడూ లేనివిధంగా అధికంగా ఉండడంతో రైతులు కల్లాల్లోనే ధాన్యాన్ని విక్రయించి లాభాలు పొందుతున్నారు. ధాన్యం నాణ్యతను బట్టి షుగర్ లెస్ రకం పుట్టి ధర రూ.19 వేల నుంచి రూ.21 వేల వరకు కొనుగోలు చేస్తున్నారు. అలాగే బీపీటీ రకం



లారీలో లోడు చేసిన ధాన్యం

ధాన్యం పుట్టి ధర రూ.18 వేల నుంచి రూ.19,500 వరకు కొనుగోలు చేస్తుండడంతో రైతులు ధాన్యాన్ని పూర్తిస్థాయిలో ఆరబెట్టకుండానే విక్రయిస్తున్నారు.

సర్వేపల్లి నియోజకవర్గంలో వరి పంట సాగు వివరాలు

మండలం	వరిసాగు విస్తీర్ణం (ఎకరాల్లో..)
వెంకటాచలం	21,800
పొదలకూరు	10,500
మనుబోలు	20,000
ముత్తుకూరు	9,000
తోటపల్లిగూడూరు	10,100

ఊహించని స్థాయిలో ధాన్యం ధరలు



ఎన్నో ఏళ్ల నుంచి వ్యవసాయం చేస్తున్నాం. కానీ ఊహించని రీతిలో ధాన్యం ధరలు ఈ ఏడాది అధికంగా ఉండడంతో కల్లాల్లోనే ధాన్యం విక్రయించుకుంటున్నాం. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంటలు పండించుకుంటున్నారు.

– మందల వరప్రసాద్, రైతు, తిక్కవరప్పాడు

రైతులకు మంచి రోజులు



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మాకు సాగునీటి కష్టాలు దూరమయ్యాయి. ప్రతి ఏటా ధాన్యం ధరలు పెరుగుతూ వస్తున్నాయి. ప్రస్తుతం ఎన్నడూ లేనివిధంగా ధాన్యం ధరలు పలకడంతో రైతులంతా సంతోషంగా ధాన్యాన్ని కల్లాల్లోనే విక్రయించుకుంటున్నారు.

– వెంకటరమణయ్య, కురిచెర్లపాడు

కందుకూరు ఎమ్మెల్యేను కలిసిన విజయకుమార్



కోవూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా నియమితులైన గొల్లపల్లి విజయ్‌కుమార్ కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డిని కందుకూరులో, సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యను సూళ్లూరుపేటలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు ఈ పదవి వచ్చేందుకు సహకరించిన కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డితోపాటు సహకరించిన అందరు శాసనసభ్యులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆయన వెంట రాష్ట్ర వ్యవసాయ మండలి అభివృద్ధి కమిటీ సభ్యుడు దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి ఉన్నారు.

ఊసపల్లిలో సిమెంటు రోడ్ల నిర్మాణం

పొదలకూరు: మండలంలోని వావింటపర్తి సచివాలయం పరిధిలో ఉన్న ఊసపల్లిలో సిమెంటు రోడ్ల నిర్మాణం చేపడుతున్నారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ఇటీవల మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఊసపల్లిలో పర్యటించినప్పుడు గ్రామస్తులు తమ గ్రామంలో సిమెంటు రోడ్లు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. వెంటనే స్పందించిన మంత్రి కాకాణి ఇంజినీరింగ్ అధికారుల ద్వారా అంచనాలు వేయించి రోడ్లను నిర్మించాల్సిందిగా ఆదేశించారు. రెండు రోజుల నుంచి గ్రామంలో సిమెంటు రోడ్ల నిర్మాణం చేపట్టారు. దీంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రీ సర్వేతో భూ వివాదాలకు అడ్డుకట్ట

- ఏడాది ఆఖరుకు సర్వే పూర్తి
- రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు
- జేసీ కూర్మనాథ్

మనుబోలు: రైతులు ఎదుర్కొంటున్న భూసమస్యలకు రీ సర్వేతో అడ్డుకట్ట పడుతుందని జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ తెలిపారు. భూముల రీ సర్వేపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం జేసీ రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం అక్కంపేట గ్రామంలో భూ హద్దు రాళ్లను నాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు జిల్లాలో 172 గ్రామాల్లో రీసర్వే పూర్తయిందని తెలిపారు. రీసర్వే పూర్తయిన గ్రామాల్లో 21 వేల చోట్ల భూహద్దులు సూచించేలా రాళ్లను నాటుతున్నట్లు తెలిపారు. 23 వేల మంది రైతులకు భూహక్కు పత్రాలను సిద్ధం చేశామని తెలిపారు. వీటిలో 118 గ్రామాల పరిధిలో 22 వేల మంది రైతులకు పత్రాలు పంపిణీ చేశామని, మిగిలిన వాటిలో తప్పులు దొర్లాయని వాటిని సరిచేసి పత్రాలు పంపిణీ చేస్తామని తెలిపారు. సర్వే పూర్తయిన గ్రామాల్లో భూతగాదాలు పరిష్కారమయ్యాయని, క్రయవిక్రయాలకు సచివాలయాల్లో భూముల రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. ఇందుకోసం వెబ్‌ల్యాండ్‌ను రూపొందించామని తెలిపారు. ఈ ఏడాది ఆఖరు నాటికి జిల్లాలో రీసర్వే



రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న జేసీ కూర్మనాథ్

పూర్తవుతుందన్నారు.

రైతులను మోసగిస్తే కఠిన చర్యలు

పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పిస్తామని, దళారులను నమ్మి మోసపోవద్దని జేసీ రైతులకు సూచించారు. ప్రస్తుతం కనీస మద్దతు ధర కన్నా అధిక ధరలకే మిల్లర్లు రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. మధ్యలో దళారులు ధరలు తగ్గించి రైతులను మోసగించాలని చూస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. త్వరలోనే కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తామని తెలిపారు. ఆయన వెంట సర్వే ఆఫ్ ఏడీ హనుమాన్‌ప్రసాద్, డీఐఓ శ్రీరామమూర్తి, తహసీల్దార్ సుధీర్, డీటీ శ్రీకాంత్‌రెడ్డి, సర్వేయర్లు గోపీకృష్ణ, శివకుమార్, ఏఎఓ కళారాణి తదితరులు ఉన్నారు.

జెన్‌కో 3వ యూనిట్‌కు త్వరలో సీఓడీ

ముత్తుకూరు: మండలంలోని నేలటూరులో ఉన్న దామోదరం సంజీవయ్య ఏపీజెన్‌కో ప్రాజెక్ట్ 3వ యూనిట్ (800 మెగావాట్లు)కి సంబంధించి త్వరలో సీఓడీ(కమర్షియల్ ఆపరేషన్స్ డేట్) ప్రారంభం కానుంది. ఈ 3వ యూనిట్ ప్రాజెక్ట్‌ను గతేడాది అక్టోబరు 27న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జాతికి అంకితం చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ యూనిట్‌లో ట్రయల్ రన్ నిర్వహిస్తున్నట్లు నిర్వహిస్తున్నారు. ఈ యూనిట్‌లో 530 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. అడపాదడపా జరిగే సాంకేతిక లోపాలను ఎప్పటికప్పుడు సరి చేసుకొంటున్నారు. దీనిపై జెన్‌కో ఉన్నతాధికారులు తరచూ సమీక్ష నిర్వహిస్తున్నారు. సాంకేతిక



నేలటూరులోని ఏపీజెన్‌కో ప్రాజెక్ట్

లోపాలన్నీ పూర్తి స్థాయిలో సరి చేసిన తర్వాత సీఓడీ ప్రారంభమయ్యే తేదీని ప్రకటిస్తామని ఇంజినీర్లు శుక్రవారం తెలిపారు.

మాదక ద్రవ్యాల వినియోగంతో అనర్థాలు

తోటపల్లిగూడూరు: మాదక ద్రవ్యాల వినియోగంతో అనర్థాలు ఉన్నాయని, యువత మాదక ద్రవ్యాలకు బానిసై చెడు మార్గంలో పడకుండా జాగ్రత్త పడాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ బాలకృష్ణ సూచించారు. మాదక ద్రవ్యాల వినియోగం, పోక్సో చట్టం, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ అనే అంశాలపై శుక్రవారం మండలంలోని ఈదూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌బీ సీఐ బాలకృష్ణ మాట్లాడుతూ యువత చెడు మార్గంలో పడి తమ ప్రాణాల మీదకు తెచ్చుకొంటున్నారన్నారు. ముఖ్యంగా మాదక ద్రవ్యాలను వినియోగించి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

తెలిపారు. ఉన్నతంగా చదివి సంస్కారవంతులుగా ఎదిగి తల్లిదండ్రుల కీర్తిప్రతిష్టలను కాపాడాలన్నారు. అనంతరం మాదక ద్రవ్యాలకు తాము దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్సై ఇంద్రసేనారెడ్డి, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, అధికార సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాలయాల అభివృద్ధికి సహకరిస్తాం

తోటపల్లిగూడూరు: తోటపల్లిగూడూరు, మాచర్ల వారిపాళెం పంచాయతీల్లో ఉన్న విద్యాలయాల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తామని నాయుడు నాగేశ్వరమ్మ వేదిక ట్రస్ట్ చైర్మన్, వ్యాపారవేత్త నాయుడు ఆదికేశవులురెడ్డి తెలిపారు. ఎన్‌డీఆర్ గ్రూపు సంస్థల వ్యవస్థాపకుడు నాయుడు దశరథరామిరెడ్డి సతీమణి నాగేశ్వరమ్మ వర్ధంతిని పురస్కరించుకొని శుక్రవారం తోటపల్లిగూడూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆదికేశవులురెడ్డి మాట్లాడుతూ ఉన్నత పాఠశాలతోపాటు స్థానిక కళాశాలల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అనంతరం విభిన్న ప్రతిభావంతులను సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటనరసారెడ్డి, ముంగమూరు యశ్వంత్‌రెడ్డి, ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ ధనుంజయ, హెచ్‌ఎం ఎస్‌కే రియాజ్ అహ్మద్, అధ్యాపకుడు ఇ.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



విభిన్న ప్రతిభావంతులతో ఆదికేశవులురెడ్డి

నేడు అమ్మవారిపాళెంలో 'గడప గడపకు..'

పొదలకూరు: మండలంలోని అమ్మవారిపాళెం గ్రామంలో శనివారం సాయంత్రం 5 గంటలకు 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహిస్తారని సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరిస్తారని, స్థానిక సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు ప్రారంభం

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు): మండలంలోని అలగానిపాడు గిరిజనకాలనీలో నూతనంగా నిర్మించిన వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో భాగంగా విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, యోదినిపూజ, అంకురార్పణ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆకురాతి శ్రీనివాసులు – నాగజ్యోతి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించగా, అర్చకులు పరాంకుశ అనంత పద్మనాభస్వామి, నిర్వాహకులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. ఒకరికి గాయాలు

ఇందుకూరుపేట: ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడి మహిళ గాయాలపాలైన ఘటన మండలంలోని జగదేవిపేటలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు మైపాడుకు చెందిన మహిళలు పనుల నిమిత్తం ఆటోలో డేవీస్‌పేటకు వెళుతుండగా మార్గమధ్యంలో జగదేవిపేట వద్ద ఎదురుగా మరో వాహనం వచ్చింది. దానిని డ్రైవర్ తప్పించబోయి అదుపుతప్పడంతో ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న ఒక మహిళకు గాయాలయ్యాయి. ఆమెను చికిత్సనిమిత్తం 108 వాహనంలో నెల్లూరుకు తరలించారు. ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదు.

గడ్డి మందు తాగిన వ్యక్తి మృతి

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు): గడ్డి మందు తాగి ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న పెదమాల శ్రీనివాసులు(40) అనే వ్యక్తి మృతిచెందగా శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై ఆంజనేయులు కథనం మేరకు మండలంలోని దంపూరుకు చెందిన శ్రీనివాసులు నిత్యం మద్యం తాగి కుటుంబ బాధ్యతలు మరచిపోవడంతో దానిపై భార్య ప్రశ్నించింది. మనస్తాపానికి గురైన శ్రీనివాసులు పూటుగా మద్యం తాగి ఆ మత్తులో గురువారం ఉదయం గడ్డి మందు కూడా తాగడంతో అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు శ్రీనివాసులును నెల్లూరులోని ఓ ఆస్పత్రికి తరలించి చికిత్సను అందించారు. అక్కడ చికిత్సపొందుతూ అర్ధరాత్రి మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. దీనిపై కేసు నమోదు చేశామన్నారు.

6న సాయిబాబా మందిర వార్షికోత్సవం

పొదలకూరు: పట్టణంలోని శ్రీషిర్డీసాయిబాబా మందిర వార్షికోత్సవం ఈ నెల 6వ తేదీన నిర్వహిస్తున్నట్లు మందిర సేవా సమితి ప్రతినిధులు శుక్రవారం తెలిపారు. ఉదయం కాగడా హారతి, ప్రణవ పతాకావిష్కరణ, బాబాకు పంచామృత అభిషేకం, విఘ్నేశ్వరస్వామి, దత్తాత్రేయస్వాములకు అభిషేకాలు, అనంతరం ధునిపూజ నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు హారతి అనంతరం తీర్థప్రసాద వినియోగం, భక్తులకు అన్నదానం ఉంటుందని తెలిపారు. సాయంత్రం 4 గంటలకు విష్ణు సహస్రనామ పూజలు, అనంతరం సాయం సంధ్య హారతి, సాయిబాబా గ్రామోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. రాత్రి 9.30 గంటలకు శేజ్ హారతి, తీర్థప్రసాద వినియోగం ఉంటుందని తెలిపారు. భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలని కోరారు.

బలవంతంగా తీసుకెళ్లి టీడీపీ కండువా కప్పారు

- తిరిగి వైఎస్సార్‌సీపీలో చేరిన మత్స్యకార నాయకుడు రమణయ్య

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు): నీతో మాట్లాడాలని చెప్పి బలవంతంగా తీసుకెళ్లి టీడీపీ నాయకులు పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఆయన కుమారుడు పోలంరెడ్డి దినేష్‌రెడ్డి నెల్లూరులోని వారి నివాసంలో తనకు టీడీపీ కండువా కప్పారని వైఎస్సార్‌సీపీ మత్స్యకార నాయకుడు వావిళ్ల రమణయ్య వాపోయాడు. కాగా కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నెల్లూరులోని ఆయన నివాసంలో శుక్రవారం రమణయ్య మరలా ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డితో వైఎస్సార్‌సీపీ కండువా కప్పించుకున్నారు. ఈ సందర్భంగా రమణయ్య మాట్లాడుతూ గురువారం విడవలూరుకు చెందిన కొందరు టీడీపీ నాయకులు తన వద్దకు వచ్చి నీతో మాట్లాడాలని చెప్పి బలవంతంగా నెల్లూరులోని టీడీపీ నాయకుడు పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఇంటికి తీసుకెళ్లారని తెలిపారు. అక్కడ తనను మభ్యపెట్టడంతోపాటు పలు విషయాల్లో ప్రలోభాలకు గురిచేసి టీడీపీ కండువాను కప్పారని తెలిపారు. అయితే తన ఆత్మాభిమానాన్ని చంపుకుని ఆ పార్టీలో ఉండలేక కేవలం 24 గంటల వ్యవధిలోనే కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో తిరిగి వైఎస్సార్‌సీపీ కండువాను కప్పించుకున్నానని తెలిపారు. ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి మత్స్యకారులకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చారని, ఆప్కాఫ్ చైర్మన్‌గా కొండూరు అనిల్‌బాబును, జెడ్పీ వైస్ చైర్మన్‌గా ఇందుకూరుపేట మహిళను, విడవలూరు వైస్ ఎంపీపీగా మత్స్యకారులను నియమితులయ్యేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆప్కాఫ్ చైర్మన్ కె.అనిల్‌బాబు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం సభ్యుడు ఎ.వాసు, సర్పంచ్ శ్రీను, నాయకులు బంగారయ్య, గోవింద్, సుబ్రహ్మణ్యం, తాతారావు, నాగేంద్ర, జయప్రకాశ్, కె.సుబ్రహ్మణ్యం, కె.తాతారావు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో మళ్లీ వైఎస్సార్‌సీపీ కండువా కప్పించుకున్న రమణయ్య

రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలి

- జెడ్పీ సీఈఓ చిరంజీవి

కొడవలూరు: కార్యాలయాల రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని జెడ్పీ సీఈఓ బి.చిరంజీవి సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యాలయంలో 35 రిజిస్టర్లు ఉంటాయని, వాటి నిర్వహణపై ఏఓ బాధ్యత తీసుకోవాలని తెలిపారు. ప్రధానంగా మూమెంట్ రిజిస్టర్‌లో అధికారులు, కార్యాలయ సిబ్బంది ఏ విధుల్లో ఉన్నారో స్పష్టంగా పేర్కొనాలని సూచించారు. రికార్డులకు, వాస్తవ పరిస్థితికి వ్యత్యాసాలుంటే సంబంధిత అధికారి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఆయన వెంట ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం, ఏఓ సురేష్‌రెడ్డి ఉన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న సీఈఓ చిరంజీవి

మేలు జాతి పాడి పశువుల అభివృద్ధికి కృషి

- జేడీ బి.మహేశ్వరుడు

బుచ్చిరెడ్డిపాళెం: మేలు జాతి పాడి పశువుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ బి.మహేశ్వరుడు తెలిపారు. మండలంలోని పంచేడు గ్రామంలో శుక్రవారం లేగదూడల ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పాడి రైతులకు అందిస్తున్న పలు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, తద్వారా వారు ఆర్థికంగా ఎదుగుతారని తెలిపారు. ముఖ్యంగా రాష్ట్రీయ గోకుల్ మిషన్‌లో భాగంగా కృత్రిమ గర్భధారణ ద్వారా పెయ్య(ఆడ) దూడల పుట్టుకకు అవసరమైన వీర్యాన్ని ప్రభుత్వం రాయితీపై ఇస్తుందన్నారు. దీని అసలు ధర రూ.750 కాగా రాయితీపై రూ.500 మాత్రమే ఇస్తుందని తెలిపారు. దీనిని ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే పలు జాతులకు చెందిన ఆడదూడలకు అవసరమైన వీర్య నాళికలను కూడా ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువస్తుందని తెలిపారు. అలాగే 1962 నంబర్‌కు ఫోన్ చేయడం ద్వారా పశువులకు వైద్యం అందించేందుకు అంబులెన్స్ రైతుల ఇంటి వద్దకే వచ్చి చికిత్స అందిస్తుందని తెలిపారు. అనంతరం లేగదూడల ప్రదర్శనలో ఎంపికైన లేగదూడల యజమానులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పశువైద్యులు సోమయ్య, రమేష్‌నాయక్, ప్రసన్నాంజనేయరెడ్డి, ఏపీఎం లలిత పాల్గొన్నారు.



విజేతగా నిలిచిన లేగదూడ యజమానికి బహుమతి అందజేస్తున్న దృశ్యం